# నడిపోడు

అమ్మ చావు బతుకుల్లో వుంది...చింటూగాడు అమెరికాలో వున్నాడు. ఫోన్లో రాలేనంత బిజీ అంటాడు...ఎలా ? పోనీ... పెద్దన్నయ్యకి కరీంనగర్ ఫోన్ చేసి చెబితే...?"

క్షీణిస్తున్న తల్లి పరిస్థితిని చూస్తూ వీర్రాజు మనసు మనసులో లేదు. ఇవే ఆలోచనలు ముసురుకుంటున్నాయి. అసహనంగా ఇంట్లో అటూ ఇటూ తిరుగుతున్నాడు. రామలక్ష్మి భర్త పరిస్థితిని చూస్తూ..."అమెరికాకి ఫోన్లమీద ఫోన్లు చేయకండి. ఇప్పటికే వేలకొద్ది బిల్లు, తగిలేసారు. ఆవిడగారు కన్నుమూసాక ఫోన్ చేయొచ్చు" అంది కాస్త కటువుగా.

ఆమెకు వాళ్ళంటే కోపం...ఆస్తి పంపకాల్నించీ ఇప్పటివరకూ తామే నష్టపోయామన్న బాధ. వీర్రాజు ఈ ఇంట్లో నడిపోడుగా పుట్టడమే ఆయన చేసుకున్న పాపమేమో అన్పించింది.

వీర్రాజు అన్న కరీంనగర్ ఆర్ అండ్ బి ఆఫీస్‌లో సూపర్నెంటు. తమ్ముడు అమెరికాలో కంప్యూటర్ ఇంజనీర్. వీర్రాజు మాత్రం పెద్దగా చదువులేక పల్లెలోనే వుండాల్సి వచ్చింది. తల్లిదండ్రుల పెంపకంలోనూ వీర్రాజు పట్ల పక్షపాత ధోరణే ఒరిగింది. మొదట పుట్టిన బిడ్డ అని వాళ్లు పెద్దబ్బాయిని ప్రేమగా పెంచారు. తండ్రికి పెద్దోడంటే అభిమానం. పెద్దోడు పుట్టిన ఏడేళ్లకి వీర్రాజు పుట్టాడు.

వీర్రాజు పుట్టిన రెండేళ్లకే చిన్నోడు పుట్టాడు. తల్లికైతే చిన్నోడంటే పంచప్రాణాలు. పట్నంలో ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చదివించింది.

తండ్రి పెద్దకొడుకుతో ప్రతివిషయం చర్చించేవాడు. 'కన్నా' అని ముద్దుగా పిలిచేవాడు. చిన్నోడిని తల్లి 'చింటూ' అంటూ పిలిచేది. వీర్రాజుకి ఏ ముద్దుపేరు రాలేదు. 'ఒరే...నడిపోడా...' అనే పిలుపు తప్ప.

చిన్నప్పట్నించి ఈ వ్యత్యాసాన్ని వీర్రాజు గమనిస్తూనే వున్నాడు. పెద్దకొడుకుని తండ్రి పొలాల వెంట తిప్పుకొస్తే...తనూ వెంటవస్తాననే వాడు వీర్రాజు.

"వాడు ఈ ఇంటికి పెద్దకొడుకు. వాడికి అన్నీ తెలియాలి. నా తర్వాతిస్థానం వాడిదే. నువ్వు బుద్ధిగా చదువుకో" అని తండ్రి అంటే మనసు గిలగిల్లాడేది.

చిన్నకొడుక్కి తల్లి గారాబంతో అన్నీ పెడుతుంటే..."అదేంటమ్మా...నాకూ సంజీవ్‌గాడిలా పెట్టవూ..." అని ప్రాధేయపూర్వకంగా అడిగితే...తల్లి నవ్వేది.

"వాడు ఈ ఇంట్లో చిన్నోడు కదరా...అందుకే కొంచెం గారాబం ఎక్కువుంటుందిలే" అనేది. తననీ ఎవరైన ఏదైన ముద్దుపేరుతో పిలిస్తే బావుండేది అని మనసు కోరుకునేది.

'నడిపోడా...' అని పిలిస్తే చివుక్కుమనేది.

ఈ భావం వీర్రాజు మనసులో క్రమంగా పెరుగుతూనే వచ్చింది. ఇంట్లో కొడుకులపరంగా ఏ విషయం చర్చించినా 'ఇంటికి పెద్దోడు' 'ఇంటికి చిన్నోడు' అనే పదాలు దొర్లిపోయేవి. తండ్రి వెంట తిరగటం వల్లనేమో...పెద్దోడికి అప్పుడే 'పెద్దరికం' వచ్చేసింది. మాటల్లో చేతల్లో అది చూపించేవాడు.

'ఒరే వీర్రాజు...తమ్ముణ్ని ఎత్తుకో' అని ఆర్డరేసేవాడు కాని...ఏడుస్తున్న తమ్ముణ్ణి ఎత్తుకునే వాడు కాదు.

అతి గారాబం వల్లనేమో...చిన్నోడికి 'అధికారం' వచ్చేసింది. అది వాడు ఏడ్చి, గిల్లి, కొట్టి, కొరికి చూపించేవాడు. ఏనాడైనా 'ఐస్‌ఫ్రూట్' కొనుక్కుంటే...మీదపడి రక్కి లాక్కునేవాడు. తనేడిస్తే తల్లివచ్చి 'పోనీలేరా...వాడు చిన్నోడు కదా' అని ప్రతిసారీ వాణ్ణి సమర్థించేది.

ఇద్దరికంటే ఎక్కువమంది కొడుకులున్న కుటుంబాల్లో...మధ్యలో పుట్టిన వాళ్ళంతా మానసికంగా ఇలాంటి సంఘర్షణలు అనుభవించేవుంటారని వయసు ఎదిగిన కొద్దీ వీర్రాజుకి అన్పించింది.

క్రమంగా అంతా ఎదిగి...పెళ్లిళ్ళయ్యాక...పెద్దవాడికి ఉద్యోగమొచ్చి కరీంనగర్ వెళ్ళిపోయాడు. చిన్నవాడు అమెరికా వెళ్లిపోయాడు. వాళ్లు వెళ్తు వెళ్తూ...చాలీ చాలని

జీతంతో పట్నంలో మిమ్మల్నెలా పోషించగలం అని పెద్దోడు చెప్పేసి వెళ్తే...అమెరికాకి మిమ్మల్ని తీసికెళ్లటం అస్సలు సాధ్యంకాదు అని చిన్నోడు వెళ్ళిపోయాడు.

ఫలితంగా వ్యవసాయం చూసుకుంటూ వీర్రాజే తల్లిదండ్రుల్ని పోషించేవాడు. అయితే ఆర్నెల్లకోమారు పెద్దకొడుకు వచ్చి తల్లిదండ్రులతో ఆప్యాయంగా గడిపేవాడు. వాడు రాగానే తల్లీతండ్రీ చూపించేప్రేమ చూసి వీర్రాజు మనసు మూగవోయేది. ఒక్కరోజు గడిపి వెళ్ళిపోతూ "ఒరే వీర్రాజు...ఈసారి పంటల మీద నావంతు డబ్బు ఎంతొచ్చింది" అని ఒంటరిగా వున్నప్పుడు అడిగేవాడు.వీర్రాజు లెక్కచూసి నాలుగైదు వేలు అప్పజెప్పిన వెంటనే వెళ్ళిపోయేవాడు.

అమెరికానించి చిన్నోడి ఉత్తరం అందగానే...తల్లిదండ్రుల కళ్లల్లో కనపడే ఆనందరేఖలు అన్నీఇన్నీకావు.

"ఇంత చాకిరీ చేస్తున్నాం...ఆప్రేమ కనీసం నాపిల్లల మీద చూపినా నేను సంతోషించేదాన్ని" అని వీర్రాజు భార్య రామలక్ష్మి నొచ్చుకునేది.

పొద్దంతా వ్యవసాయం చేసి వచ్చిన తన భర్త కష్టాన్ని గుర్తించకుండా...అమెరికాలో కొడుకు ఏం కష్టపడుతున్నాడో అని తల్లి తరచూ గుర్తుచేస్తుంటే...అది సహించని రామలక్ష్మి తన అసహనాన్ని, కోపాన్ని పిల్లలమీద చూపించేది. దాంట్లో అందరిమధ్య ఏదో దూరం పెరుగుతున్నట్టు అన్పించేది. పెద్దోడు వచ్చివెళ్లినప్పుడల్లా...అమ్మా నాన్నల్ని బాగా చూసుకొమ్మని నీతివాక్యాలు చెప్పిపోయేవాడు.

ఓరోజు అర్ధరాత్రి...తండ్రికి గుండెపోటు రావడంతో వీర్రాజు తల్లడిల్లిపోయాడు. పల్లెలో సరైన సౌకర్యాలు లేక...నొప్పి ఎక్కువై తెలతెలవారుతుండగా తండ్రి చనిపోయాడు. పెద్దవాడికి, చిన్నవాడికి కబురుపంపి వాళ్ళు రావడానికి వీర్రాజు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పెద్దకొడుకు వస్తూనే...నొప్పి గురించి రెండు మూడ్రోజుల ముందే తనకి ఫోన్ చేస్తే సిటీకి తీసుకెళ్లేవాన్ని. తండ్రిని బతికించుకునేవాన్ని...అంటూ వూరివాళ్ళముందు భోరున ఏడ్చాడు.పెద్దోడికి తండ్రి మీదున్న ప్రేమకి వాళ్లు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు.

చిన్నవాడు అమెరికానుంచి రాలేకపోయాడు...ఫోన్ చేసి భాదపడ్డాడు. దశదిన కర్మ అయ్యేంత వరకూ...ఖర్చులన్నీ వీర్రాజే భరించాడు.

ఆ మర్నాడే..."ఆస్తి పంపకాలు చేసుకుందాం రా నడిపోడా...కరీంనగర్‌లో ఇల్లు కట్టుకుంటు న్నాను. డబ్బు అవసరంవుంది" అన్నాడు పెద్దన్నయ్య.

"తమ్ముడు తిరిగొచ్చాక పంపకాలు చేసుకోవటం మంచిదేమో అన్నయ్య" అన్నాడు వీర్రాజు.

"సరే...మరి నేను ఇంటికి పెద్దవాణ్ణి కాబట్టి...జ్యేష్ఠపాలు కింద చెరువుకింది అయిదెకరాల పొలం ఇవ్వాలి" అన్నాడు.

అది విన్న వీర్రాజు భార్య...కోపంగా లేచింది.

"మీకెందుకు జ్యేష్ఠపాలు ఇవ్వాలి ? ఈ ఇంటికి మీరేం కష్టపడ్డారని...అసలు జ్యేష్ఠపాలు ఎందుకిస్తారో తెల్సా ?" అని గయ్‌మని లేచింది రామలక్ష్మి.

రామలక్ష్మి అలా అనగానే పెద్దాయన భార్యకూడా గొడవకి దిగింది.

తోడికోడళ్ళ మధ్య ఆరోజు పెద్దగొడవే జరిగింది.

ఫలితంగా...తెల్లవారి ఆస్తిపంపకాల విషయమై ఊరి పెద్దలతో పంచాయతీ జరిగింది.

"తండ్రికి తలకొరివి పెట్టినోడు కాబట్టి...ఇంటికి పెద్దదిక్కు కాబట్టి జ్యేష్ఠపుపాలు ఇవ్వాల్సిందే" అని వాళ్లు తీర్పు చెప్పారు.

ఊరి పెద్దలకన్నా...వీర్రాజుతో తల్లికూడా అదేమాటనడం...అతణ్ణి కుంగదీసింది. అతడు అపురూపంగా చూసుకునే పొలం పెద్దవాడికి జ్యేష్ఠపాలు కింద పోగా...మూడ్రోజుల్లో దాన్ని ఎనభైవేలకి అమ్మేసుకున్నాడు.

ఈలోగా ఓ పెద్దమనిషి వీర్రాజుతో "ఒరే వీర్రాజు...నూరేళ్ళయినా చావు తప్పదు. వెయ్యేళ్లయినా వేరు తప్పదని పెద్దలూరికే అన్లేదు. ఓసారి భూములు, మరోసారి ఇల్లు...ఇట్లా ఒక్కొక్కటే పంచుకోవడమేమిట్రా...ప్రతీసారి పంచాయితీలు. దదువతులు, కుల పెద్దలకు తాగిపిచ్చుడు, తినిపిచ్చుడు. ఈ తతంగం కన్న ఇప్పుడే ఇల్లుకూడా పంచుకోండి." అని సలహా ఇచ్చాడు.

అది విన్న పెద్దవాడి భార్య 'అవునవును...ఇల్లుకూడా పంచేసుకొని ఎవరి హద్దులు వాళ్లు పెట్టుకోవడం మంచిది' అని ఉబలాటపడింది.

రామలక్ష్మి కూడా 'ఇంటెడు చాకిరీ తప్పుతుంది...ఎప్పుడైతే ఏమిట్లే' అని వీర్రాజుతో 'సరేనసండి...' అన్నట్టుగా సైగ చేసింది.

కాని వీర్రాజు మనసు...ఇల్లు మూడుముక్కలవటం ఒప్పుకోవట్లేదు. మెల్లిగా తల్లి దగ్గరికెళ్లి చెప్పాడు.

"పెద్దోడు ఎట్లా అంటే అట్లాగే కానియ్ బిడ్డా...చిన్నోడు లేకపాయె. వాడికి అన్యాయం జరక్కుండా సూడుండ్రి" అంది.

తను చనిపోయేంత వరకైనా ఈ ఇంటిని చీల్చొద్దని తల్లి ఈ నిర్ణయాన్ని కాదంటుందని ఆశపడ్డ వీర్రాజు మనసు మరోసారి బరువుగా మూలిగింది. తల్లి మాట

విన్న పెద్దకొడుకు "సర్లే...వాడు అమెరికాలో వున్నంత మాత్రాన వాడికేం అన్యాయం జరుగదు. పంచాయితి పెద్దలే కొలతలు గీసి పంచుతారు కదా" అన్నాడు.

వీర్రాజుకి అన్నయ్య మనసులో కూడా ఇల్లు పంపకాలు జరగాలనే ఉద్దేశ్యం వుందని ఆ మాటతో అర్థమైంది.

మర్నాడు...

పదిమంది పెద్దల సమక్షంలో ఇల్లు మొత్తంని కొలిచారు. ఇంట్లో గొలుసులు, టేపుల్తో కొలుస్తుంటే తేళ్లు, జెర్రులు పాకుతున్నట్టనిపించింది వీర్రాజుకి.

మూడు గదుల చొప్పున ఇంటిని మూడు భాగాలుగా గీతలు గీసారు. తర్వాత వేపచెట్టుకింద నులక మంచాలేసి కూచున్నారు.

"ఇంక పంచేదేముంది ? ఆనవాయితీ ప్రకారం పడమటి దిక్కున పెద్దోడుండాలె. తూర్పు దిక్కున చిన్నోడికి రావాలె. మధ్యలో నడిపోడుండాలె" అన్నాడొకాయన.

ఎక్కడయిన అంతేకదా... అని తీర్మానించారు.

ఆ మాటవిని వీర్రాజు గుండె చెమ్మగిల్లింది. వీర్రాజు కొచ్చిన మూడు గదుల్లోను ఎప్పుడు వడ్లు, పెసల్లు, జొన్న గింజలు పోసే గదులవి. దాంతో ఆ గదులు ఎలుకలు, పందికొక్కులు చేసిన బొరియల్తో...కనీసం సిమెంటు కూడా చేయకుండా వుంచారు. పెద్దమనుషుల మాటలతో రామలక్ష్మి గయ్‌న లేచింది.

"ఏం పంచిండ్రు. ధాన్యం పోసుకునే గదులు మాకెందుకు...తూర్పు దిక్కున గదులకు ముప్పయ్ వేలు పెట్టి మంచిగ చేయించినం. మా పైసంత గంగల కల్సినట్లేనా గిదేం పంచాయితీ" అంది.

"అందరు పంచుకునే ఇల్లని తెల్సి మీ పైసల్తోని ఎవరు రిపేర్లు చేయించమన్నరు. పెద్దోనికి చిన్నోనికి చెప్పే చేసిండ్రా ? రామలక్ష్మి నువ్వు మాట్లాడవద్దు" అన్నాడో పంచాయితీ పెద్ద.

రామలక్ష్మి ఇకలాభం లేదనుకొని భర్తని తిట్టింది.

"అన్నయ్య, తమ్ముడని ఎగవోసుకుంట జేస్తివి. ఇప్పుడు నోట్లె మన్ను కొట్టిండ్రు. ఆ గదుల్ల ఉండే బదులు ఈ చెట్టుకింద ఉన్నది నయం...నువ్వు మాట్టాడక పోయేసరికి ముద్దేసుకుపోతుండ్రు" అంది.

రామలక్ష్మి ఆరోపణలన్నీ నిజమేనని వీర్రాజుకి తెలుసు.

"గా గదులు నాకెందుకు...నాకు పడమటి దిక్కుయి కావలె" అన్నాడు.

పంచాయితీలో కొంచెం కలకలం...

వీర్రాజు పట్టు వీడలేదు.

అరగంట సేపు వాదోపవాదాలు జరిగాయి.

అన్నీ వింటున్న పెద్దాయన భార్య..."పెద్దోనికి పెరట్లో పెట్టిన మెచ్చుతడు. చిన్నోడికి చింతకింద పెట్టిన మెచ్చుతడు కాని...నడిపోనికి నట్టింట్ల పెట్టిన మెచ్చుడు అని వూరికే అన్నారా...ఇప్పుడు కనవడ్తంది" అంది.

ఆ మాట...వీర్రాజు మెహంమీద కొరడాతో చెళ్లున కొట్టినట్టన్పించింది. మనసు గిలగిల్లాడింది...హక్కు కోసం పోరాడితే కూడా...నడిపోడి మీద అనాదినించీ వేసే అభాండం అది!

"సరే...ఇలాగే కానివ్వండి" అన్నాడు.

దాంతో పంచాయితీ ముగిసింది. అంతా వెళ్లిపోయారు.

వేప చెట్టుకింద...మంచం మీద వీర్రాజు ఒక్కడే మిగిలిపోయాడు.

నాల్రోజుల్లో...ఆ ఇంట్లో అడ్డుగోడలు మొలిచాయి.

రెండు పోర్షన్‌లకు తాళాలు పడ్డాయి. మధ్యలోవున్న గదుల్లో రామలక్ష్మి వంట చేస్తుంటే...మూసుకుపోయిన కిటికీల్తో ఇల్లంతా పొగజూరి...గాలి, వెలుతురు ఏవీ రాక ఊపిరి సలపనట్టుగావుంది.

అప్పుడే వచ్చిన ఆడబిడ్డ రాజేశ్వరి 'వీర్రాజన్న...' అంటూ లోపలికొచ్చింది. రామలక్ష్మి ఆమెను సాదరంగా ఆహ్వానించింది. రాజేశ్వరి రాగానే తల్లితో కొంచెం సేపు మాట్లాడి వీర్రాజు రాగానే..."అన్న...నా చిన్న కొడుకు పుట్టు వెంట్రుకలు వేములవాడలో తీస్తున్న. ఈసారి నువ్వు తులం బంగారం పెట్టాలె" అంది. వీర్రాజు నవ్వాడు.

"మేమే వేరుపడి కష్టాల్లో వున్నాం వదినే. అర్ధతులం పెడతాం తియ్.. పెద్దోల్లు ఎంత పెడ్తరట" అంది రామలక్ష్మి.

"వాళ్ళేం పెడతారు ?" మేమే పెట్టాలి. పెద్దన్నకి ఓ డ్రెస్సు, వదినెకి ఓ చీరెకొన్నాం. ఎందుకంటే పుట్టు వెంట్రుకలు పెద్దోడే తీయాలె కదా..." అంది.

అంతలోకే రాజేశ్వరిని తల్లి పిలిచింది.

"నాకు ప్రాణం బాగుంటలేదు బిడ్డా...రేపో మాపో అన్నట్టుంది. నేను పోయినంక ఎవరేం పెడ్తరో, పెట్టరో...కొడుకు పుట్టెంటికలు అంటివి. ఎప్పటికైనా తల్లిమీది సొమ్ములన్ని బిడ్డకే చెందాల్నాయె. ఈ రెండు తులాల పుస్తెల తాడు ఇప్పుడే తీసుకుపో..." అంది మెడలోంచి గొలుసు తీసిస్తూ...

"సరేనమ్మా..." అంది రాజేశ్వరి. వీర్రాజు, రామలక్ష్మి ఏమీ అన్లేక పోయారు. రాజేశ్వరి వెళ్లి పోయాక ఆ రాత్రి భోజనం పెడుతూ రామలక్ష్మి అంది.

"మనం పుట్టెడు చాకిరీ చేస్తున్నామన్నా గ్యానమైనా లేదు ముసల్దానికి. బంగారం

తీసి బిడ్డ చేతుల పెట్టింది" అంది వీర్రాజుతో...

"అప్పుడే అడగక పోయినవ్" అన్నాడు. అన్నం కెలుకుతూ...

"ఏమనాలె...అమ్మమీది సొమ్ములు బిడ్డకే చెందాలని లోకం అనదా?" అంది.

"అందరికీ అన్నీ చెందుతాయి...ఒక్క నడిపోడికి తప్ప" అన్నం మీంచి లేచిపోయాడు వీర్రాజు.

తరువాత వీర్రాజు తల్లి జ్వరంతో మంచమెక్కింది.

శాపనార్థాలు పెడుతూనే రామలక్ష్మి ఆమెకి అన్ని సేవలు చేస్తోంది. దాదాపు ఆర్నెల్లుగా ఆమె మంచంలోనే మలమూత్రాలు చేసుకుంటున్నా భరిస్తూ చేస్తున్నారు.

కాని...పరిస్థితి ఇప్పుడు విషమించింది.

తల్లి ఎప్పుడు కన్నుమూసేది. తెలీని స్థితిలో రాత్రుళ్లు కూడా నిద్రమానుకొని తల్లి మంచం దగ్గరే వుంటున్నాడు వీర్రాజు.

ఆ తల్లిమనసు...దూరంగా వున్న చిన్నకొడుకు కోసం పలవరిస్తోంది.

"ఒరే నడిపోడా...ఒక్కసారి చింటూగాన్ని పిలిపించరా..." అని వందలసార్లు అడిగింది.

భార్యకి భయపడి ఏమీ అనలేకపోయినా...బయటికెళ్ళి రెండు మూడుసార్లు అమెరికాకి ఫోన్ చేసొచ్చాడు...వాడు పొడిపొడిగా మాట్లాడటం తప్పితే...వస్తాను, రాను అని ఏ విషయమూ చెప్పలేదు.

వీర్రాజు మాత్రం తల్లిని ఊరడిస్తూనే వున్నాడు.

చిన్నకొడుకు కోసం పలవరించి...పలవరించి కన్నుమూసిందామె.

వీర్రాజులో దుఃఖం తెంచుకుంది. కరీంనగర్‌నించి పెద్దకొడుకు హుటాహుటిన వచ్చాడు.

అమెరికాకి ఫోన్ చేసి విషయం చెప్పాడు.

"వాడొచ్చేసరికి రెండు మూడ్రోజులవుతుందేమో...అప్పటివరకూ అమ్మనెలా వుంచుదాం? బాధగా అన్నాడు వీర్రాజు పెద్దమనుషుల్తో.

"అదేంట్రా...తల్లికి చిన్నకొడుకే కొరివి పెట్టాలి. వాడొచ్చేంత వరకూ మంచుగడ్డల్లో శవాన్ని పెట్టి వుంచండి" అన్నారంతా.

"వాడు అందుబాటులో లేనప్పుడు...నేను పెట్టకూడదా?" వీర్రాజు మనసులో ఏదో సంశయం.

"నువ్వు ఈ ఇంటికి నడిపోడివి...నువ్వెలా తలకొరివి పెడతావ్? అది మన సంప్రదాయం కాదు" అన్నారు పెద్దమనుషులు.

తల్లిదండ్రులకు బండెడు చాకిరీ చేసినా తలకొరివి పెట్టడానిక్కూడా అర్హతలేని తనమీద తనకే జాలిపుట్టింది వీర్రాజుకి.

'నడిపోడు' అనే ఒక్క పదంతో బాధ్యతలన్నీ నెత్తిమీద పెట్టినా...సంప్రదాయపరంగా ఇవేం అడ్డు తెరలు?? ఆ బాధనే వ్యక్తపరుస్తూ తన ఆప్తమిత్రుడైన సర్పంచ్ రాఘవరామ్‌తో చెప్పుకున్నాడు.

అతడు వీర్రాజుని ఓదారుస్తూ "పిచ్చోడా...రామాయణ కాలంనించీ నడిపోడికి ఈ బాధలు తప్పలేదు. భరతుడు రాముడి పాదరక్షల్ని సింహాసనం మీద చూపిస్తూ తను రాజ్యపాలన చేయాల్సి వచ్చింది. భారతంలో సైతం అర్జునుడే అందరికీ శతృవయ్యాడు కాని...ధర్మరాజో, సహదేవుడో కాలేదు..." అన్నాడు.

"ఇలా ఎందుకుండాలి? పెద్దవాడు, చిన్నవాడితో పోలిస్తే మధ్యలో పుట్టినవాళ్లు కుటుంబ సంప్రదాయపరంగా వ్యక్తిత్వం లేని వాళ్లవుతున్నారు. డమ్మీ కొడుకులుగా మిగులుతున్నారు. మాలోని ప్రేమలు, ఆప్యాయతలూ పంచుకుంటూనే...

కట్నకానుకల దగ్గర, ఆస్తి పంపకాలదగ్గర, అంత్యక్రియలదగ్గర భేదాలు చూపించటం ఎంతవరకు సబబు..." అని బాధపడ్డాడు.

అప్పటికే అమెరికా నించి చిన్నవాడు రావటంతో...హడావిడిగా అంత్యక్రియలు జరిపారు.

పదకొండో రోజున మళ్లీ ఎక్కడివాళ్ళక్కడ వెళ్లిపోయారు.

ఇల్లంతా స్మశాన నిశ్శబ్దం...

దిగాలుగావున్న వీర్రాజు దగ్గరికి రామలక్ష్మి వచ్చి కూచుంది.

"నాకు తెలుసయ్యా...నువ్వు తల్లిదండ్రుల్ని ఎంత ప్రేమించిందీ...ఎంత సేవ చేసింది...నీచేతులమీదుగా వాళ్ళని పంపిచాలని ఆశపడ్డావ్...కాని అలా జరగనందుకు బాధపడుతున్నావా..."అంది.

వీర్రాజు ఏమీ మాట్లాడలేదు.

"మీకు మరో విషయం చెప్పాలి..." అంది కొంచెం సంశయంగా.

"ఏంటీ?"

"నాకు మళ్లీ నెల తప్పింది. ఇప్పటికే మనకిద్దరు మగపిల్లలున్నారు కదా. ఈసారి ఆడపిల్ల పుట్టొచ్చు..."

ఆ మాటతో వీర్రాజు మొహంలో కలవరం పాకిపోయింది.

"ఆడపిల్లే పుడుతుందన్న గ్యారంటీ ఏమిటి? మళ్లీ మగపిల్లాడు పుడితే...?

ఈ ఇంట్లో 'నడిపోడు' అనే పేరుతో మరొకడు నలిగిపోవటం నాకిష్టంలేదు. రేపే దవాఖానకెళ్లి అబార్షన్ చేయిద్దాం..." అని చెప్పేసి విసురుగా లేచి వెళ్లిపోయాడు.

అతడు వెళ్ళినవైపే దు:ఖంతో... చూస్తుండిపోయిందామె...

కె.వి.నరేందర్